క్లుప్తంగా

ముగిసిన శిక్షణ

ఘంటసాల: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో సహకార సంఘాల ప్రతినిధులకు సర్టిఫికెట్ కోర్సు శుక్రవారం ముగిసింది. కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి కోర్స వివరాలను వెల్లడించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు 15 రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. శిక్షణ ముగించుకున్న అభ్యర్థులకు కేవీకే ప్రాంగణంలో సమన్వయకర్త డాక్టర్ సుధారాణి ఆధ్వర్యంలో కోర్సు ఇన్చార్జి డాక్టర్ కె.రేవతి సర్టిఫికెట్లను అందించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ మంజువాణి, యశ్వంత్ కుమార్, డాక్టర్ వెంకటలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ శిబిరం పరిశీలన

గూడూరు: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫిజియోథెరపి శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని మచిలీపట్నం డీవైఈఓ బి.ఎస్.సి. శేఖర్‌సింగ్ కోరారు. గూడూరులోని భవిత కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఫిజియోథెరపి శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నడవటానికి కూడా ఇబ్బంది పడుతున్న ఎం.ఎలీషా అనే ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారికి రోలేటర్ బహూకరించారు. కార్యక్రమంలో ఎంఈఓ– 2 పి.సుబ్రహ్మణ్యం, ఫిజియోథెరపిస్ట్ జె.నాగమల్లేశ్వరరావు, ఐఈఆర్పీలు పి.రమాదేవి, సజనీబేగం పాల్గొన్నారు.

మండలాన్ని ముందంజలో ఉంచాలి

ఘంటసాల: ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి మండలాన్ని ముందంజలో ఉంచాలని ఎంపీడీవో డి.సుబ్బారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు, జీఎంఎస్‌కేలతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లలో తొట్టెల నిర్మాణానికి పంచాయతీ తీర్మానం చేస్తే ఉపాధిహామి పథకం ద్వారా నిర్మించుకోవచ్చన్నారు. పలు అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు సుగుణ కుమారి, సురేంద్ర, ఏపీవో రాజ్ కుమార్ పాల్గొన్నారు.

50 కేజీల వెండి తాపడానికి ప్రత్యేక పూజలు



పెడన: పట్టణంలో వేంచేసి శ్రీగంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో గర్భాలయ ముఖద్వారానికి తొడగనున్న వెండితాపడానికి శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీన వెండి తాపడాన్ని గర్భాలయ ముఖద్వారానికి తొడగనున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ భళ్ల ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉత్సవ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో దాతలు, భక్తుల సహకారంతో 50 కేజీల వెండితో తయారు చేయించిన వెండి తాపడానికి శుక్రవారం సంప్రోక్షణ చేశారు. ఐలూరి జై కిషోర్ ఆధ్వర్యంలో గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు పూజ, అభిషేకాలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, ఆలయ ప్రధాన అర్చకుడు గూడూరు ఆగస్త్యయ్య, శివదత్త ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

పెడన: మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చేవెంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పొదిలి రవికుమార్ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల బోధన సామగ్రిని చక్కగా తయారు చేశారు. చక్కటి పద్యాలాపన, తెలుగు భాష ఔన్నత్యం తెలుపుతూ వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు తెలుగు భాష గొప్పదనం గురించి తెలుపుతూ చేసిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. తెలుగు ఉపాధ్యాయులు బసవేశ్వరరావు, హిందీ ఉపాధ్యాయిని దుర్గ, ఆంగ్లోపాధ్యాయురాలు భానుశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

నాగాయలంక: మండలంలోని వక్కపట్లవారి పాలెం లాకుల నుంచి భావదేవరపల్లి ప్రధాన మార్గంలో ఓఎన్‌జీసీ సంస్థ సైట్‌లకు వచ్చే భారీ వాహనాల కారణంగా ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైందని స్థానిక తహసీల్దార్ ఎం.హరనాథ్‌కు శుక్రవారం వక్కపట్లవారిపాలెం, భావదేవరపల్లి గ్రామస్తులు వినతిపత్రం అందించారు. నష్ట నివారణ చర్యలు చేపట్టాలని, చమురు అన్వేషణ పరిసర గ్రామాలలో సంపూర్ణ మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ వినతిపత్రంలో పేర్కొన్నారు. అంతకు ముందు గ్రామస్తుల సహకారంతో రోడ్డుపై భారీ గుంతలను ప్రొక్లెయిన్ సహాయంతో పూడ్చి సరిచేశారు. మండలి నరేష్, అంబటి లక్ష్మణప్రసాద్ (పాలెం చిన్నా), ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, మెండు సాయిరామ్ ఉన్నారు.

పల్లాకుతో పరేషాన్

- చుట్టేస్తున్న పల్లాకు తెగులు
- సగానికి సగం దిగుబడి పడిపోతుందని రైతుల ఆందోళన
- పంట చేతికొస్తుందనుకున్న తరుణంలో నిరాశ
- దిక్కుతోచని స్థితిలో రైతులు



కొత్తపేటలో పల్లాకు ఉధృతంగా వచ్చిన పొలం



పల్లాకు తెగులు వల్ల కాయ పిందె లేకుండా పసుపు పచ్చగా మారిన మినుము మొక్క ఆకులు

అవనిగడ్డ: దివిసీమలోని పలు ప్రాంతాల్లో మినుము పంటను పల్లాకు తెగులు చుట్టేస్తోంది. మరికొన్ని రోజుల్లో పంటచేతికొస్తుందనుకున్న తరుణంలో పల్లాకు తెగులు విస్తరించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనివల్ల సగానికి సగం దిగుబడి తగ్గిపోతుందని వాపోతున్నారు.

వేగంగా చుట్టేస్తున్న తెగులు..

అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 64 వేల ఎకరాల్లో ఈ ఏడాది మినుము పంట సాగు చేశారు. ముందుగా సాగుచేసిన ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో మినుము లాగే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లో ఎక్కువగా పూత, పిందె, కాయ తయారు దశలో ఉంది. గత పదిహేను రోజుల నుంచి మినుములో పల్లాకు తెగులు ఉధృతి బాగా పెరుగుతోందని కొంతమంది రైతులు చెప్పారు.

ఈ తెగులు సోకితే..

తెల్లదోమ ఆశించడం వల్ల పల్లాకు తెగులు వస్తున్నట్టు తెలిపారు. ఎన్నిసార్లు దోమ మందులు పిచికారీచేసినా ఉధృతి తగ్గడం లేదు. పల్లాకు తెగులు ఆశించిన మొక్కల ఆకులన్నీ పసుపు పచ్చగా మారి ఆకులోని పత్ర హరితం మొత్తం పోతోంది. దీనివల్ల పూత, పిందె, కాయ దశలో ఉన్న పంట పరిపక్వంగా రాదు. పిందెగా మారాల్సిన పూత చిన్న పిందెలుగా మెలికలు తిరిగి రావడం, కాయలు వంకరలు తిరిగి గింజల పెరుగుదల ఆగిపోతోంది. ఎకరాకు రూ.18 వేల నుంచి రూ.22 వేల వరకు పెట్టుబడి పెట్టారు. అవనిగడ్డ మండలం, కొత్తపేట, రామకోటిపురం, రామచంద్రపుర, కోడూరు మండలం పిట్టల్లంక, విశ్వనాథపల్లి, మాచవరంలో పల్లాకు తెగులు ఉధృతి ఎక్కువగా ఉంది. రామకోటిపురం, కొత్తపేట గ్రామాల్లో కొన్ని పొలాలు వారం రోజుల్లోనే పల్లాకు తెగులుతో తిరగమారిపోతున్నాయని, కాయలు ఉండటం లేదని కొంతమంది రైతులు చెప్పారు.

ఇదీ కారణమే..

ప్రతి సంవత్సరం ప్రభుత్వం 40 నుంచి 50 శాతం నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేసేది. ఈ ఏడాది 15 శాతం కూడా విత్తనాలు సరఫరా చేయక పోవడంతో ఎక్కువ మంది రైతులు సేకరించిన విత్తనాలపైనే ఆధారపడ్డారు. ఈ విత్తనాల నుంచే పల్లాకు తెగులు, బంగారు తీగ వచ్చిందని కొంతమంది రైతులు చెప్పారు.

కౌలు రైతుల కుదేలు..

రెండో పంటపై ఆధారపడి రైతులు కౌలుకు సాగు చేస్తుంటారు. మొదటి పంట వరిలో ఖర్చులు కూడా రావు, రెండో పంట బాగుంటే కౌలు పోనూ ఖర్చులు వస్తాయి. ఈ ఏడు దిగుబడి బాగా పడిపోవడం, పల్లాకు, బంగారు తీగ ఆశించడంతో దిగుబడులు పడిపోయాయి. గత ప్రభుత్వం రైతులకు అందించిన రైతు భరోసా కూటమి ప్రభుత్వంలో ఇవ్వలేదు. దీంతో తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తోందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



సగం దిగుబడి తగ్గింది..

ఐదెకరాలు కౌలుకు సాగుచేస్తున్నాను. పదిహేను రోజుల వరకూ పంట బాగానే ఉంది. వారం రోజుల్లో పల్లాకు తెగులు బాగా పెరిగిపోయింది. దీనివల్ల ఎకరాకు నాలుగు బస్తాలు కూడా అయ్యే పరిస్థితి లేదు. ఎకరాకు 20 బసాల చొప్పున కౌలుకు సాగుచేస్తున్నాను. ఈ సంవత్సరం మినుము పంట దెబ్బతినడంతో ఖర్చులు కూడా రావు.

– అందె ప్రసాద్, కౌలు రైతు, రామచంద్రపురం

కంట్రోల్ అవడం లేదు..

రెండు ఎకరాలు కౌలుకు సాగుచేస్తున్నాను. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఎక్కువగా పల్లాకు తెగులు వచ్చింది. వారం పది రోజులకు దోమ మందు కొడుతూనే ఉన్నాం. అయినా తగ్గడం లేదు. దీనివల్ల దిగుబడి తగ్గిపోతుంది. రెండో పంటపైనే ఆశ పెట్టుకుని కౌలుకు సాగుచేస్తున్నా. ఈ పంట సరిగా రాకపోతే నష్టపోవాల్సి వస్తుంది.

– తెనాలి ఏడుకొండలు, పిట్టల్లంక, కోడూరు మండలం

తెల్లదోమ నివారణే పరిష్కారం

తెల్లదోమ వల్ల పల్లాకు తెగులు వస్తుంది. పల్లాకు తెగులు రాని విత్తనాలను ఎంచుకుంటే ఈ సమస్య ఉండదు. ఎండలు ఎక్కువగా ఉండటం, మంచు బాగా రావడం వల్ల తెల్లదోమకు అనుకూలమైన వాతావరణం ఉంది. మందులు కూడా నాలుగైదు రకాలు కలిపి కొడుతున్నారు. దీనివల్ల దోసు తగ్గడం, అన్ని మందులు ఒకేసారి కలపడం వల్ల సరిగా పనిచేయక పోవడం వల్ల పల్లాకు పెరగడానికి కారణం. దోమ మందు కొట్టుకోవడమే పరిష్కారం.

– జయప్రద, ఏడీఏ, అవనిగడ్డ

ఇళ్లవద్దే తడి, పొడి చెత్తను వేరుచేయాలి

కలెక్టర్ డీకే బాలాజీ



లంకపల్లిలో సేకరించిన చెత్తను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

లంకపల్లి(ఘంటసాల): గ్రామాల్లో ఇళ్ల వద్ద నుంచే నేరుగా తడి, పొడి చెత్తను సేకరించేలా చూడాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. మండలంలోని లంకపల్లి గ్రామ పంచాయతీలో తడి, పొడి చెత్త సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్ల పనితీరును కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తడి, పొడి చెత్తను కలిపి ఇస్తే వారి ఇంటి వద్దే తారు బల్ల వేసి ఎలా వేరు చేయాలో అవగాహన కల్పించి గ్రీన్ అంబాసిడర్లకు అందించేలా ప్రోత్సహించాలన్నారు. ప్రజలు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తేనే పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ సాధ్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కె.నాగనాంచారమ్మ, కె.పద్మారావు, ఎఫ్ఏ వై.దుర్గాప్రసాద్, సచివాలయం, పంచాయతీ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

మాజేరులో పర్యటన

చల్లపల్లి: మరో నాలుగు రోజుల్లో ఇక్కడికి వస్తానని అన్ని పనులు సక్రమంగా జరగాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని కొత్తమాజేరులోని సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కంపోస్టు తయారు చేయటంలో పంచాయతీ వారు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. గ్రామ పరిధిని బట్టి సంపద తయారీ కేంద్రంలో తగినంత చెత్త లేకపోవటంతో ఇఓఆర్‌డి రవిశంకర్‌పై, సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. పొడి చెత్తల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా కనిపించటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తడి పొడి చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూసి నాణ్యమైన వర్మీ కంపోస్టును తయారు చేయవచ్చని చెప్పారు. మార్గ మధ్యలో స్కూలుకు వెళుతున్న పిల్లలను ఆపి స్కూలు ఎలా ఉంది, చదువు ఎలా చెపుతున్నారంటూ ఆరా తీశారు. కలెక్టర్ వెంట మాజేరు ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి పి.రాంబాబు, చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి పేర్ని వెంకట మాధవేంద్రరావు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైతులకు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి



పెదకళ్లేపల్లిలో ర్యాలీలో వ్యవసాయాధికారులు



బంటుమిల్లి సచివాలయంలో ఈ రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రైతులు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): రైతులు తమ భూములకు ఐడీ నంబర్ తప్పని సరిగా పొందాలని కోరుతూ వ్యవసాయాధికారులు పెదకళ్లేపల్లిలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కె.హెప్సిబారాణి మాట్లాడుతూ రైతు సేవాకేంద్రాల్లో ప్రతి రైతు తమ పొలాలకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ ఐడీ నంబర్ ఉంటేనే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, ఇన్‌పుట్ సబ్సిడీ, భీమా వంటివి వర్తిస్తాయని వివరించారు. పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్, బ్యాంకు అక్కౌంట్, మొబైల్ తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

బంటుమిల్లి: రైతులందరూ తప్పనిసరిగా ఈ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయశాఖాధికారి జి.శివరామకృష్ణ తెలిపారు. ఈ రిజిస్ట్రేషన్ ఉన్న రైతులకే పథకాలు వర్తిస్తాయని, అలాగే పంట నష్టం అందుతుందన్నారు. ఫిబ్రవరి నెలాఖరుకల్లా ప్రతి రైతూ తమ ఆధార్ కార్డు, పాస్ పుస్తకం తీసుకుని సచివాలయాల్లో ఈ రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని ఏఓ శివరామకృష్ణ సూచించారు.

చల్లపల్లి: సొంత భూమి ఉన్న రైతులు ఈ నెల 28వ తేదీలోపు తమ విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని ఎంఏవో సాయి సింధు కోరారు. రైతులకు ప్రత్యేకంగా ఈ విశిష్ట నమోదు సంఖ్య కలిగిన కార్డులను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల ఎంతో ఉపయోగం ఉందని వివరించారు. రైతులు తమ పొలం ఉన్న రెవెన్యూ గ్రామంలో పరిధిలో రైతు సేవా కేంద్రాలకు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్సులతోపాటు సెల్‌ఫోనును కూడా తీసుకువెళ్లి నమోదు చేయించుకోవాలి.

రోడ్డు మార్జిన్‌లో దుకాణాల తొలగింపు



మాట్లాడుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

మచిలీపట్నంటౌన్: స్థానిక పెడన రోడ్‌లో ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ప్రహరీ వెంబడి దుకాణాలను నగరపాలకసంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. కోర్టు స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ జేసీబీ, మినీ రోబోలు, కూలీలతో ఈ ప్రాంతంలోని బడ్డీలను, దుకాణాలను తొలగించారు. నగర కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, టీపీఓ హరిప్రసాద్ పర్యవేక్షణలో ఈ పనులు చేపట్టారు. ముందస్తు సమాచారం లేకుండా ఉదయం 7 గంటల నుంచే తమ దుకాణాలను తొలగించారని, తాము జీవనాధారాన్ని కోల్పోయామని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేశారు. దుకాణాలను తామే తొలగించుకుంటామని సమయం ఇవ్వాలని కోరినా అధికారులు కనికరించలేదని వాపోయారు. 2వ డివిజన్ కార్పొరేటర్ పరింకాయల విజయ్ చంద్ర కుమార్ రామాలయం వద్ద నిర్మించిన బస్‌షెల్టర్‌ను కూడా తొలగించారు.

మేయర్, కార్పొరేటర్‌ల ఆగ్రహం

ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లిస్తూ, విద్యుత్ మీటర్లు పొందిన దుకాణదారులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా ఎలా తొలగిస్తారని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ టీపీఓ హరిప్రసాద్‌ను ప్రశ్నించారు. కమిషనర్ ఆదేశాలతో ఈ తొలగింపు ప్రక్రియను ప్రారంభించామని ఆయన ఆమెకు బదులిచ్చారు. ఇలా పేదలను ఇబ్బంది పెట్టడం ఎంత వరకూ సమంజసమని ఆమె ప్రశ్నించారు. మేయర్‌తో పాటు డెప్యూటీ మేయర్‌లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, పలువురు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్‌లు, నాయకులు బాధిత దుకాణదారులకు అండగా నిలిచారు.

క్షయను మందులతో నయం చేసుకోవచ్చు

మచిలీపట్నంటౌన్: క్షయ రోగులు ఆరు నెలల పాటు మందులు వాడి వ్యాధిని జయించవచ్చని టీబీ డిస్ట్రిక్టు యూనిట్ పీపీఎం కోఆర్డినేటర్ ఎన్.మధుసూదనరావు అన్నారు. టీబీ నివారణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రధాన పార్కు ఆవరణలో రుస్తుంబాద మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో క్షయ వ్యాధిపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకంటే ఎక్కువ రోజులు దగ్గు, జ్వరం వస్తుండటం, బరువు తగ్గటం, ఆకలి మందగించటం వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధి సోకినట్లుగా నిర్ధారించవచ్చునన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారికి స్థానిక జీజీహెచ్‌లో ఉచితంగా కళ్లె పరీక్షలు చేస్తారన్నారు. వ్యాధి నిర్ధారణ అయ్యాక ప్రభుత్వం ఉచితంగా అందించే మందుల కోర్సును ఆరు నెలల పాటు తీసుకోవాలన్నారు. రోగం సోకిన వారికి కేంద్ర ప్రభుత్వం పౌష్టికాహార కిట్లు, రూ. 6 వేల నగదు అందజేస్తుందన్నారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, టీబీ యూనిట్ హెల్త్ ఎడ్యుకేటర్ కేవీవీ ప్రసాద్‌బాబు, ఎ.విజయగౌరి, ఉపాధ్యాయిని పి.శ్యామల కుమారి హాజరయ్యారు.

వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

చల్లపల్లి: వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక వివేకానంద, విజయా కళాశాలల 33వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథి బుద్ధప్రసాద్ మాట్లాడారు. పిల్లలు మంచి స్నేహాలతో ఉత్తమ వ్యక్తిత్వ వికాసంతో ఎదగాలని ఆకాంక్షించారు. యువత అధునిక శాస్త్ర సాంకేతిక రంగాల పురోగతిని సద్వినియోగం చేసుకుని పురోగమించాలన్నారు. మాతృభాషా దినోత్సవం సందర్భాన్ని గుర్తుచేశారు. విద్యాసంస్థల అధినేత యార్లగడ్డ శివరామప్రసాద్ సేవలను ప్రశంసించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్వచ్ఛ చల్లపల్లి రథసారధి డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, కళాశాలల ప్రిన్సిపాల్స్ పెమ్మసాని రమేష్‌బాబు, షేక్ అబ్దుల్ రహీమ్, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మందుల దుకాణంలో చోరీ

పెడన: మండల పరిధిలోని నందమూరు గ్రామంలో శివ మెడికల్ దుకాణంలో గురువారం అర్ధరాత్రి చోరీ సంఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం ఉదయం మెడికల్ షాపు పక్కన కూరగాయాలు విక్రయించే వారు మందుల దుకాణం యాజమాని శివకు ఫోన్ చేసి తలుపులు తీసి ఉన్నాయని తెలియజేశారు. శివ దుకాణం వద్దకు వచ్చి చూస్తే షెట్టర్‌కు వేసిన తాళాలు, లోపల ఉన్న తాళలు పగలగొట్టి ఉన్నాయి. దుకాణంలో ఉన్న రూ.20 వేలు నగదు, మరికొన్ని మందులు దొంగలు ఎత్తుకుపోయారంటూ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదో తరగతి విద్యార్థులకు అవగాహన

కోనేరుసెంటర్: బందరు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మచిలీపట్నంలో ప్రముఖ విద్యావేత్తలు సైకాలజిస్టుల సహకారంతో కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రముఖ విద్యావేత్త దిట్టకవి వెంకటేశ్వరరావు తెలిపారు. బందరు మండలం చిన్నాపురం, గుండుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పదో తరగతి పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పదవ తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన ఇరువురు పేద విద్యార్థులను దత్తత తీసుకుంటామని చెప్పారు. ప్రతిభ గల విద్యార్థులకు మెడల్స్, ప్రసంశాపత్రాలు అందజేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జాయింట్ సెక్రెటరీ ఎం.శాస్త్రి, చిన్నాపురం పాఠశాల హెచ్‌ఎం జి.ఉదయభాను, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, గుండుపాలెం పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వరరావు, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కైవల్యాశ్రమంలో సహస్ర లింగార్చన

పాగోలు(చల్లపల్లి): మండల పరిధిలోని పాగోలులో శ్రీకైవల్యాశ్రమ చలాచల బోధోపదేశ మందిరంలో శుక్రవారం సహస్ర లింగార్చన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కమలాత్మిక సహిత అచలేశ్వర ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా గత ఆరు రోజులుగా ప్రత్యేక, విశిష్ట పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. విద్యాసాగర్ స్వామి పర్యవేక్షణలో డాక్టర్ వడ్లమూడి సుబ్రహ్మణ్య అవధాని, వడ్లమూడి కేదారశర్మల ఆధ్వర్యంలో నిర్వమించిన కార్యక్రమాల్లో ట్రస్టీ మేకా సత్యనారాయణ ప్రసాద్ దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఆదివారం ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు మేనేజింగ్ ట్రస్టీ చాపరాల గాంధీప్రసాద్ తెలిపారు.

అర్హులకు పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలి

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని ఉత్తరచిరువోలులంక గ్రామ సర్పంచ్ చింతా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 2023 డిసెంబర్ నెల వరకు దరఖాస్తులు చేసుకున్న ప్రతి లబ్ధిదారులకు 2024 జనవరి నెల 1వ తేదీన పింఛన్లు అందించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ వల్ల ఫిబ్రవరి, మార్చినెలలో కొత్త పింఛన్లు మాంజూరు కాలేదన్నారు. అర్హులైన వృద్ధాప్య, వికలాంగుల, వితంతు పింఛన్లు మంజూరు చేయాలని పీఏసీఎస్ మాజీ చైర్ పర్సన్ రెడ్రౌతు వెంకట రమణ, పేరెంట్స్‌కమిటీ మాజీ చైర్మన్ నడకుదుటి రాము, గ్రామ ఉపసర్పంచ్ బొమ్మసాని అక్ష్మణరావు, పులిగుజ్జ శ్రీనివాసరావు అధికారులను కోరారు.

ఈ నెలాఖరులోగా రీ సర్వే పూర్తిచేయాలి

సర్వే అకాడమీ ట్రైనీ ఏడీ రంగప్రసాద్

వక్కలగడ్డ(చల్లపల్లి): ఈ నెలాఖరులోపు రీ సర్వే పనులు పూర్తిచేయాలని సర్వే అకాడమీ ట్రైనింగ్ ఏడీ రంగప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని వక్కలగడ్డ గ్రామంలో పర్యటించారు. ఇక్కడ జరుగుతున్న రీ సర్వే పనులను పరిశీలించారు. రైతులు, అధికారులతో సర్వేపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలోని రీ సర్వే రికార్డులను పరిశీలించారు. అనంతరం రంగప్రసాద్ మాట్లాడుతూ వక్కలగడ్డ గ్రామాన్ని రిసర్వే కోసం పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నట్లు తెలిపారు. గ్రామంలో 758 మంది రైతులకు చెందిన 1,913 ఎకరాల భూమిని సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 550 మందికి చెందిన 1,400 ఎకరాల భూమిని రీ సర్వే చేసినట్లు వివరించారు. మిగిలిన రైతులకు సమాచారం ఇచ్చి వారి సమక్షంలోనే సర్వే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటి వరకూ సర్వే అధికారులు సంతృప్తి కరంగా సర్వే చేసినట్లు తెలిపారు. ఆయన వెంట సర్వే అధికారులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

హెచ్‌ఐవీ రోగులకు కంటి ఆపరేషన్లు

మచిలీపట్నంటౌన్: స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో హెచ్‌ఐవి రోగులకు క్యాటరాక్ట్ చికిత్సలు శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. శస్త్ర చికిత్సల అనంతరం రోగులకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డీ ఆశాలత, నేత్ర విభాగాధిపతి డాక్టర్ జి.భానుమూర్తి కళ్లజోళ్లు, మందులు అందజేశారు. హెచ్‌ఐవీ రోగులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి ధైర్యం చెప్పారు. సర్వజన వైద్యశాలలో నేత్ర వైద్యుడు భానుమూర్తి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా హెచ్‌ఐవి రోగులకు కంటి ఆపరేషన్లు ప్రారంభించారు. శుక్రవారం నలుగురు హెచ్‌ఐవీ రోగులకు నేత్ర శస్త్ర చికిత్సలు చేయగా, ఆస్పత్రిలో ఇప్పటివరకూ 19 మందికి ఈ శస్త్ర చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత మాట్లాడుతూ హెచ్‌ఐవీ రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌ఐవీ రోగులకు శస్త్ర చికిత్సలు చేస్తున్న నేత్ర వైద్యుడు భానుమూర్తిని ఆమె అభినందించారు.

పెడన నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కొండ మృతి

కృత్తివెన్ను: పెడన నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పడవల శ్రీరామ కొండలరావు (కొండ) గుండెపోటుతో మృతి చెందారు. గురువారం రాత్రి గుండెపోటు రావడంతో భందువులు హాస్పిటల్‌కు తరలించే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. ఆయన భౌతికకాయాన్ని శుక్రవారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల రాము, పలు పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. బీజేపీ జెండాను ఆయన పార్థీవదేహంపై ఉంచి స్వగ్రామం పోడులో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు కృష్ణాజిల్లా, బంటుమిల్లి మండలం, బంటుమిల్లి గ్రామ కాపురస్తులు పూర ఆదినారాయణ గారి కుమారుడు రామకృష్ణారావు గారి సంజాయిషీ మేర ఇవ్వు ప్రకటన.

నా క్లయింటు పేరుతో గల 20 రూపాయల నాన్‌జ్యుడీషియల్ స్టాంపు పేపర్లు ది. 31-8-2019 సం॥నకు సంబంధించినవి సంతకాలు చేసియున్న సీరియల్ నెం. 72AA485766 ను నుండి 72AA485770 ను గల 5 ఒరిజినల్స్ తీసుకొని మచిలీపట్నం రిజిస్ట్రారు వారి ఆఫీసు నుండి బంటుమిల్లి వెళుచుండగా పోయినవి. దొరికిన వారు తెలుపగలరు. అట్లుగాక ఎవరైనా సదరు దస్తావేజులపై ఏవిధమైన అన్యాక్రాంతములు గానీ, లావాదేవీలు, క్రయ విక్రయాలు గానీ జరిపిన యెడల అట్టి వ్యవహారములు చట్టరీత్యా చెల్లనేరవనియు నా క్లయింటును బైండు చేయజాలవనియు మరియు అట్టి వ్యవహారములు జరిపిన వారు నా క్లయింటు తీసుకొనే సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

మచిలీపట్నం
ది. 21-2-2025

పి. మురళీకృష్ణ, అడ్వకేట్
ఫోన్ : 93929 12347